క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలను పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేసిన ఆకు కూరల స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి ధరతో పాటు డిమాండ్ అధికంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రక్షాబంధన్



విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని వెంకటాపురం గ్రామంలో మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం గెలగాని ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థినీవిద్యార్థులకు అన్నచెల్లెల అనుబంధం తెలియజేసేందుకు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యార్థినులచే రాఖీ కట్టించారు.

చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లా గుండ్లకుంట గ్రామానికి చెందిన గోరిగె పాపయ్య, సతీమణి చెన్నమ్మ, కుటుంబ సభ్యులు రూ.50వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి అందజేశారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు వేదపండితులు ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం గీతా

కోవెలకుంట్ల: కర్నూలులో జేఎంజే సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 8,.9వ తేదీల్లో సెయింట్ జోసఫ్స్ బాలికల కళాశాల ప్రాంగణంలో యువత మహోత్సవ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఇందులో భాగంగా జరిగిన సాంస్కృతిక పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి మొదటిస్థానంలో నిలిచారన్నారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు సిస్టర్లు బాల, రోజా, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని అయ్యలచెర్వులో ఈనెల 9న బనగానపల్లె ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థి మహబూబ్ బాషాకు తీవ్రగాయాలైన విషయం విదితమే. విద్యార్థి తల్లి షేక్ మాబీ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ హుస్సేన్ నాయక్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు.

మల్లికార్జునుడికి శ్రావణమాస పూజలు



బేతంచెర్ల: మండలంలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాసం సోమవారం సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు.

భారీ వర్షం

- కోవెలకుంట్లలో అత్యధికంగా 29.8 మి.మీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పంటల్లో చేరిన వర్షపునీరు





సొదరదిన్నె వద్ద పొలంలో భారీగా చేరిన వర్షపునీరు, ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నవంచెవాగును అతికష్టం మీద దాటుతున్న సచివాలయ ఉద్యోగి



రాఘవరాజుపల్లె వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



కనకాద్రిపల్లె బస్టాప్ వద్ద పారుతున్న నీరు

కోవెలకుంట్ల: ఉపరితల ఆవర్తన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 29.8 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 17.6 మి.మీ, దొర్నిపాడు మండలంలో 8.6 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 5.4 మి.మీ, సంజామల మండలంలో 5మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. కోవెలకుంట్లలో భారీ వర్షం కురియడంతో పట్టణంలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. పట్టణశివారులోని జగనన్న కాలనీని వర్షపునీరు చుట్టుముట్టడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బస్టాండ్ చుట్టూ రెండు అడుగుల మేర వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది.

ఉప్పొంగిన చిన్నవంచె వాగు

కోవెలకుంట్ల– లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం రాత్రి నుంచి చిన్న వంచె వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురువడంతో పాటు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా నీటిని విడుదల చేశారు. నదిలో వరదనీరు భారీగా చేరడంతో ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. నదిలోని వరద మండలంలోని వల్లంపాడు వద్ద ఉన్న చిన్న వంచెవాగుకు పోటెత్తింది. వాగుపై చిన్నపాటి వంతెన ఉండటంతో వంతెనపై మూడు అడుగుల మేర నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు స్తంభించి పోయాయి. లింగాల మీదుగా నంద్యాల, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అస్కారం లేకపోవడంతో కోవెలకుంట్ల వైపు వచ్చి ఆయా ప్రాంతాలకు వెళుతున్నారు. కొందరు వ్యక్తులు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో వాగు దాటేందుకు సాహసం చేసి ఆవతలి ఒడ్డును చేరుకుంటున్నారు. కుందూనదికి వరదనీరు పోటెత్తడంతో నదితీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

బనగానపల్లెలో 19.2 మీమీ వర్షపాతం

బనగానపల్లె : మండల పరిధిలో సోమవారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షపాతం 19.2 మిమీ నమోదు అయింది. ఈ వర్షం వల్ల సాగులో ఉన్న మొక్క జొన్న కంది పత్తి మరిన్ని పంటలతో పాటు వేస్తున్న వరి నాట్లకు ఊరట లభించినట్లు రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.

జాతీయ రహదారిపై వర్షపునీరు

కొలిమిగుండ్ల: వర్షపు కురిస్తే చాలా అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై నీళ్ల ప్రవహిస్తున్నాయి. రెండు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తుండటంతో సమీపంలోని కొండలు, పొలాల వైపు నుంచి పెద్ద ఎత్తున వర్షపునీరు రోడ్డుపైకి చేరుతున్నాయి. మట్టి కొట్టుకొచ్చి కుప్పలుగా మేట వేస్తోంది. దీంతో రాక పోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాఘవరాజుపల్లె పెద్దమ్మ ఆలయం, కనకాద్రిపల్లె బస్టాప్‌తో పాటు బెలుం, తుమ్మలపెంట క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయి. అంకిరెడ్డిపల్లె సమీపంలోని గాలి మరల సబ్‌స్టేషన్‌కు ఎదురుగా కొండల పైనుంచి నీళ్ల ప్రవాహానికి కొట్టుకొచ్చిన మట్టి రోడ్డుపై పేరుకుపోయింది. రాత్రి వేళల్లో వాహన చోదకులు ఇక్కడ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకొని వర్షపునీరు రోడ్డుపై పారకుండా డైవర్షన్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు కోరారు.

ఉమామహేశ్వరులకు పల్లకీ సేవ



యాగంటిలో శ్రీ ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం ఉమామహేశ్వరస్వాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోండి



నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల: పట్టణంలో విషజ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా పట్టణవాసులు విషజ్వరాల బారినపడి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయించి దోమలు, ఈగల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉదయ్, ప్రదీప్, మధు, రవి, శ్రీమన్నారాయణ, దేవరాజు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

ప్యాపిలి: జలదుర్గాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు నేసే శ్రీనివాసులు, మండల కోఆప్షన్ సభ్యుడు రసూల్, ఎంపీటీసీ సభ్యుడు జయరామయ్య ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. జలదుర్గం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సంతకాల సేకరనలో పలువురు సంతకాలు చేసి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ నాయకులు తమ పార్టీ అధికారంలోకి వస్తే జలదుర్గాన్ని మండల కేంద్రం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి జలదుర్గాన్ని మండలంగా ప్రకటించాలని కోరారు.

సంక్షిప్తం

రేవనూరులో చోరీ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరుకు చెందిన సిద్ధారెడ్డి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు.. కుటుంబ యజమాని సొంత పనుల నిమిత్తం హైదరాబాదుకు వెళ్లగా ఆయన భార్య ఇంటికి తాళం వేసి తాళంచెవిని పక్కనే ఉన్న గూటిలో పెట్టి బర్రెలు మేపేందుకు వెళ్లింది. గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం తీసి ఇంట్లో బీరువాలో ఉన్న దాదాపు 10 నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేలు నగదు అపహరించుకెళ్లారు. బర్రెలు మేపుకుని ఇంటికి వచ్చాక బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. చోరీ ఘటనపై రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ప్యాపిలి: ఆశా వర్కర్లకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమారి, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌ఏ చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. జలదుర్గం సీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆశాలను ఉద్దేశించి వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. గల్లా పరీక్షల బాక్స్‌లను ఆశాలతో తెప్పించకూడదన్నారు. డెలివరీ కేసులు, ఫ్యామిలీ ప్లానింగ్, గర్భిణులను సీహెచ్‌సీలకు తీసుకువచ్చిన ఆశాలకు రవాణా చార్జీలు, రోజువారీ ఖర్చులు ఇవ్వాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ మండల నాయకులు రాజకుమార్, సరోజమ్మ, సరస్వతి, సుభద్ర, పద్మావతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆశావర్కర్ల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లక్ష్మిదేవి, ఉపాధ్యక్షులుగా కృష్ణవేణి, కార్యదర్శిగా రామలక్ష్మి, సహాయ కార్యదర్శిగా దేవమ్మ, కోశాధికారిగా నాగలక్ష్మి తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

డోన్ టౌన్: ఈనెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సరీ్వసుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు, లేదా ఓటరు కార్డు చూపించాల్సి ఉంటుందన్నారు.

కుడా అప్రూవల్ లేని ప్లాట్లు కొనొద్దు

ప్యాపిలి: కుడా అనుమతి లేని ప్లాట్లు కొని ఇబ్బందులు తెచ్చుకోవద్దని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కుడా అనుమతి లేని లేఅవుట్‌లోని ప్లాట్లను కొనుగోలు చేసి గత జూన్ 30 కంటే ముందే రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద ప్లాటు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇలా చేసుకోవడం ద్వారా ఫీజుపై 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఇకపై భవన నిర్మాణాల కోసం అప్రూవల్స్ అన్ని ఆన్‌లైన్‌లోనే జరుగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు కుడా వారి లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌ను సంప్రదించాలన్నారు.

ఏకలవ్య కాలనీగా నామకరణం చేయాలి

ప్యాపిలి: స్టేట్ బ్యాంకు వెనుక ఉన్న ప్రాంతాన్ని ఏకలవ్య కాలనీగా నామకరణం చేయాలని ఏకలవ్య సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు మనోరమ సోమవారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. లేఅవుట్‌లోని ప్లాట్లలో ఎరుకల సోదరులు గృహాలు నిర్మించుకున్నారని, ఈ ప్రాంతానికి పేరు లేకపోవడంతో చిరునామా తెలియజేయడంలో ఇబ్బందిగా ఉందన్నారు. తమ కులదైవం ఏకలవ్యుడి పేరుతో కాలనీగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఏకలవ్య సేవాసమితి కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షులు శేషాద్రి, కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: అక్షరాస్యతలో వెనుకబడిన బేతంచెర్ల పట్టణంలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఆర్డీఓ నరసింహులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతంచెర్ల మండలంలో అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ బీసీ వసతి గృహ సదుపాయం లేకపోవడంతో బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యశించిలేకపోతున్నారన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యాక్సిస్ బ్యాంకు, జొమాటో, అమెజాన్, దొడ్ల డెయిరీ, ఎస్‌ఎస్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర పది కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఈడీ, ఎం ఫార్మసీ, పీజీ చేసిన నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 86886 51650, 97059 98056 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేల బెలుంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణ మాసం కావడంతో పాణిమట్టం రూపంలో కొలువైన స్వామిని ఆలయ పూజారి రవిస్వామి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జామునే అభిషేకం, విశేష పూజలు చేశారు. బందార్లపల్లెతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా జలదుర్గం గ్రామానికి మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

రేపు రైతు సంబర సభలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని మార్కెట్‌యార్డులో ఈనెల 13న రైతు సంబర సభలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన సభా ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉప కమిషనర్, ఈఓ రామాంజేయులు సోమవారం తెలిపారు. ఆస్తకి ఉన్నవారు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తులను ఆలయంలోని కార్యాలయంలో అందజేయాలన్నారు.

- **బనగానపల్లె :** మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి నియామకం కోసం ఆసక్తి కలిగినవారు 20 రోజులోపు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ పాండురంగారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొద్దిపాటి వర్షానికే జలమయం



జలమయమైన నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

డోన్ : ఆదివారం కురిసిన కొద్దిపాటి వర్షానికే పట్టణ శివారులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణ జలమయమైంది. దీంతో సోమవారం విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులతో పాటు స్థిర, చరాస్తుల క్రయ, విక్రయాలు జరిపే వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. టీడీపీ నాయకుని స్వలాభాపేక్ష కోసం పట్టణ నడిబొడ్డున ఉన్న కార్యాలయ భవనాన్ని కాదని శివారు ప్రాంతాల్లోకి తరలించి తమకు తీవ్ర అసౌకర్యం కల్పించడం పాలకులు, అధికార పార్టీ నేతలకు సమంజసంగా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనం వద్ద మహిళలు, పురుషులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేనందున చెప్పలేని ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్ : ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి జీఎం టాకీస్ సర్కిల్ వరకు జాతీయ జెండాతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం రోజు ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలతో పాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఎం ప్రతాప్, ఈఓఆర్‌డీ బాలాంజనేయులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీది అధికార దుర్వినియోగం



మాట్లాడుతున్న మద్దిలేటి

డోన్ టౌన్: ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి, డీసీసీ ఉపాధ్యక్షులు ఉన్నిగోర్ల జనార్ధన్ విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఓటర్ల జాబితాపై ధర్నా చేస్తున్న లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంపీ ప్రియాంకగాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ స్థానిక కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది లాంటిదన్నారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తూ అలాంటి ఓటు హక్కును ఎన్నికల కమిషన్ విలువ లేకుండా నకిలీ ఓటర్లతో జాబితాలు సిద్ధం చేసి బీజేపీకి వత్తాసు పలుకోతోందని ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించిన నాయకులను అరెస్టు చేయడం తగదన్నారు. సమావేశంలో డోన్ మండల అధ్యక్షులు పఠాన్ మహబూబ్ హుస్సేన్, పట్టణ అధ్యక్షులు శేఖర్, ప్యాపిలి మండల అధ్యక్షులు మహేంద్రనాయుడు, డీసీసీ కార్యదర్శి మధుసూదనరెడ్డి ఉన్నారు.

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలి



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, బటన్ హోల్ ఆపరేషన్లు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు హరి, పృధ్వీ కుమార్, సహాయ కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ హనీఫ్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని డోన్, ప్యాపలి, బేతంచెర్ల మండలాలతో పాటు కృష్ణగిరి, వెల్దుర్తి, దేవనకొండ మండలాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు కుటుంబ నియంత్రణ కోసం తరలివస్తారన్నారు. బటన్ హోల్ ఆపరేషన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.

పాఠశాలను సందర్శించిన అధికారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరు కొట్టాల ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డిప్యూటీ తహసీల్దార్ మారుతీ సోమవారం సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సక్రమంగా భోజనం పెట్టడం లేదని ప్రజా వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వారు ఎంఈఓలు సోమశేఖర్, అబ్రహ్మాం విద్యార్థుల తల్లిదండ్రులను విచారించారు. తల్లి దండ్రుల అభిప్రాయాలను కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కోవెలకుంట్లలో ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని ఇందూ జ్ఞానవేదిక మండల కమిటీ అధ్యక్షుడు జనార్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆ వేడుకలను సంబంధించిన ఆహ్వాన పత్రికలను మేజర్‌గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని స్టేట్‌బ్యాంకు రోడ్డులో ఈ నెల 16వ తేదీన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు రోజులపాటు ప్రత్యేక పూజలు అనంతరం ఈ నెల 21వ తేదీన పట్టణంలో శ్రీకృష్ణుడి విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు మధుసూదన్, వెంకటరమణ, సుబ్బరాయుడు, సుబ్బారావు, నాగరాజు, చౌడయ్య, చరణ్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.